


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

వైఎస్ఆర్ కడప

గురువారం 18 డిసెంబర్ 2025

పేజీలు - 08


## టిడిపి జిల్లా అధ్యక్షుడిగా

# భూపేష్ రెడ్డి



**కడప-మేజర్‌న్యూస్ బ్యూరో :** జమ్మలమడుగు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తెచ్చిన యువతేజం చదిపిరాళ్ల భూపేష్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధ్యక్షుడుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం అధికారికంగా ఎంపిక చేయడంపై జిల్లాలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. మంగళవారం కడప జిల్లా అధ్యక్ష పదవిని భూపేష్ రెడ్డి పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో కడప జిల్లాలో 7 నియోజక వర్గాల్లో 7-7 స్థానాలు గెలిచి టిడిపికి బహుమతిగా అందించేందుకు ప్రణాళికలు రూపొందించుకొని పార్టీ అభివృద్ధి కోసం పోరాడుతామని ..మిగతా 2పేజీలో

## అనుమానిత ప్రాంతాలపై

# స్పెషల్ డ్రైవ్

వేంపల్లె, మేజర్‌న్యూస్: 8లో

## జిల్లా కలెక్టర్లే ప్రభుత్వానికి

# బ్రాండ్ అంబాసిడర్లు



**'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' మన విధానం**

**నిత్య విద్యార్థుల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు**

**విమర్శలకు బెదిరేదీ లేదు... పీపీపీతోనే మెరుగైన వైద్య సేవలు**

**5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**కలెక్టర్ల సదస్సులో కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్**



**కడప-మేజర్‌న్యూస్ బ్యూరో :** అమరావతిలో మంగళవారం రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి అంబాసిడర్లుగా పనిచేయాలని, ప్రభుత్వంపై సానుకూలత రావాలంటే అధికారులదే కీలక పాత్రగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఏపీ గురించే చర్చించుకునేలా... ప్రభుత్వంపై ప్రజలకున్న విశ్వసనీయత కొనసాగించేలా చూడాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. పొలిటికల్ గవర్నెన్సు అనేది కీలకమని... కలెక్టర్లు తమ ప్రతిభ ద్వారా కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా చూడాలని సీఎం చెప్పారు. ప్రతీ నిమిషం తనని తాను మరింత ఉన్నతంగా తీర్చిద్దుకుంటున్నాని అధికారులకు ముఖ్యమంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇక నుంచి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఉండాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహా విధానాన్నే పరిపాలనలోనూ తెస్తున్నట్టు సీఎం ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరుగుతున్న 5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో బుధవారం వివిధ అంశాలపై సీఎం జిల్లా కలెక్టర్లకు సూచనలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు, అధికారుల పనితీరును స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సే కొలమానంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. కొన్ని జిల్లాలు అనుసరించే బెస్ట్ ప్రాక్టీసెస్ ..మిగతా 2పేజీలో

## నిబంధనలకు..

# తిలోదకాలు

**కోడి కూతకు ముందే తెరుచుకుంటున్న వైన్ షాప్**

**ఏడాది క్రితం ఇళ్ళ మధ్య వున్న ఆ మద్యం దుకాణంపై మహిళల ఆగ్రహం**

**నేటికీ ఎక్సైజ్ అధికారుల చర్యలు శూన్యం అంటున్న స్థానికులు**



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ప్రొద్దుటూరు లో ఓ వైన్ షాప్ నిబంధనలకు తిలోదకాలిచ్చి, సమయపాలన అనే మాటే మరిచారు. కోడి కూతకు ముందే ఆ వైన్ షాప్ లో ప్లాస్టిక్ గ్లాసుల పలపల శబ్దం వెలువడుతోంది. ఏడాది క్రితం ఇళ్ళ మధ్య వున్న ఆ మద్యం దుకాణంపై మహిళల ఆగ్రహం చేసి తొలగించాలని ఆందోళనలు చేశారు. కానీ నేటికీ ఎక్సైజ్ అధికారుల చర్యలు శూన్యం అంటూ స్థానికుల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి... వివరాల్లోకెళితే... ప్రొద్దుటూరు పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో వున్న ఓ వైన్ షాపు నిర్వాహకుడు ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చారని ప్రజలు విమర్శించారు. తనకు ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలన పట్టదన్న చందంగా ఇష్టానుసారంగా వైన్ షాప్ ను తెల్లవారు జామునే తెరచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. మందు బాబులు తెల్లవారు జామున మెలకువ వస్తే ఇబ్బంది లేదు తమ షాపుకు రండి కిక్కెంచుకొండి అంటూ మందు బాబులకు బంపర్ ఆఫర్ ప్రకటించాడని విమర్శిస్తున్నారు. దీంతో మందు బాబులు తెల్లవారు జాము నుండే ప్లాస్టిక్ గ్లాసులు పలపల మనిపిస్తూ తమ నిషాను ఆస్వాదిస్తున్నారని, ఆ వైన్ షాప్ నిర్వాహకుడు మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాగిస్తున్నాడని ప్రజలు బాహాటంగానే చర్చించుకోవడం గమనార్హం. కాగా ఈ వైన్ షాప్ విషయంలో మరో కొస మెరుపు ఏమిటంటే ఏడాది ..మిగతా 2పేజీలో

## కలిసి కట్టుగా


# పని చేద్దాం..

**పార్టీలకు అతీతంగా ప్రగతి వైపు అడుగులు వేద్దాం**

**టిడిపి నియోజకవర్గ బాద్యుడు బిటెక్ రవి**

**పెద్దసంఖ్యలో టీడీపీలోకీ చేరికలు**

**క్యాడర్, పార్టీలో ఫుల్ జోష్**



**వేంపల్లె మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ గెలుపుకు కలిసి కట్టుగా పని చేద్దామని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, ప్రగతి వైపు అడుగులు వేద్దామని ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గం బాధ్యుడు ఎం.రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) పిలుపునిచ్చారు. బుధవారం వైఎస్ఆర్సీపి నుంచి పెద్ద సంఖ్యలో టిడిపిలోకి చేరికలతో క్యాడర్ తో పాటు పార్టీకీ పూర్వవైభవం, జోష్ నింపాయి. వైఎస్ఆర్సీపి నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్మాంగే)తో పాటు కుటుంబాలు, యువత పెద్ద ఎత్తున టిడిపి కండువా ధరించారు. వీరిని కడప పోలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులు రెడ్డి, ఇంఛార్జీ బిటెక్ రవి స్వాగతం పలికారు. అంతకు ముందు దిల్మాంగే అనుచరులు, అభిమానులు బైక్ ర్యాలీ చేపట్టారు. అలాగే స్థానిక జడ్పీ బాలుర పాఠశాల నుంచి పూల వర్షం, డీజేలతో రోడ్డు షో నిర్వహించారు. అడుగుతున్నా పూల వర్షం కురిపిస్తూ నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇద్దరు సిఎంలు గా పరిపాలించిన ఈ నియోజకవర్గంలో త్రాగు, సాగునీరును అందించలేక పోయారన్నారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్, నియోజకవర్గంలో ఏ రంగానైనా ముందుకు తీసుకువెళ్లాడా అని ఒకసారి ఆలోచించాలని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాల్లో కాని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లి రైతులకు నీళ్లు ఇవ్వాలనే ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. పైడిపాళెం, చిత్రావతి రిజర్వాయర్ లను పూర్తి చేసి, నీళు ఇచ్చిన ఘనత సిఎం చంద్రబాబుది ..మిగతా 2పేజీలో

# టిడిపి జిల్లా అధ్యక్షుడిగా భూపేష్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

భూపేష్ రెడ్డి అభిమానులు కార్యకర్తలు నాయకులు పేర్కొంటున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో నిరంతరం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తూ నియోజకవర్గంలోని ప్రజలు కార్యకర్తల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా పనిచేయాలని నాయకులకు నిరంతరం దిశా నిర్దేశం చేస్తూ భూపేష్ రెడ్డి ఎంతగానో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. నేటి నుంచి కడప జిల్లా అభివృద్ధిని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో వినిపించేలా కృషి చేస్తానని, ముఖ్యమంత్రి తనపైనమ్మకంతో ఇచ్చిన కడప జిల్లా అధ్యక్ష పదవికి న్యాయం చేస్తానని తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, యువనేత లోకేష్ బాబుకు నాయకులకు, కార్యకర్తలకు భూపేష్ రెడ్డి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులుఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

### టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి కోరారు. ప్రతి విద్యార్థి ఆధార్ క్యాంపు నిర్వహణ తేదీలు గుర్తుపెట్టుకుని మొదటి విడత: ఈ నెల 16 నుండి 20 వరకు, రెండో విడత: ఈ నెల 22 నుండి 24 వరకు తమకు సంబంధించిన ఆధార్ కార్డులోబయోమెట్రిక్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్న బద్వేల్ నియోజకవర్గ విద్యార్థులందరూ తమ పాఠశాలల్లోనే ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తున్నాము. మీ విద్యా ప్రగతికి, ప్రభుత్వ పథకాలకు ఆధార్ అనుసంధానం ఎంతో కీలకం, కావున ఈ అవకాశాన్ని వదులుకోవద్దుఅని రితీష్ రెడ్డి కోరారు.

# కలిసి కట్టుగా పని చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)



అని అన్నారు. అలాగే గతంలో కాలేటి వాగును కుళ్ళారని, ఇప్పటికీ అతిగతి లేదని, కాలేటి వాగు పూర్తి చేయాలని బిటెక్ రవి, సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారన్నారు. వాగుకు నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. హంద్రీనీవా నుంచి ఎర్రబల్లి చెరువుకు నీళ్లు తెప్పిస్తామని జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో చెప్పినట్లుగా మారెడ్డి లతారెడ్డి జడ్పీటీసీగా గెలిచిన పదహేదు రోజుల్లో నీళ్లు తెచ్చిన ఈ ప్రభుత్వానిదే అని గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. దీనికి సంబంధించి జీఓ కూడా తెచ్చారని బిటెక్ రవిని కొనియాడారు. రాష్ట్రంలో స్థిరమైన, సుస్థిరమైన పాలన కొనసాగుతుందని, రాష్ట్రాన్ని అప్పుల్లోంచి గట్టెక్కించేదానికీ వస్తున్న పెట్టుబడులను చూసి రాష్ట్ర ప్రజలు చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంకా పదేహేను ఏళ్లు ఉండాలని కోరుతున్నారన్నారు. టిడిపిలోకి భారీ చేరికలతో వైఎస్ఆర్సీపి ఖాళీ కావడం ఖాయమన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపిని ఖాళీ చేసి, టీడీపీ కూటమి సుస్థిరమైన పాలన తీసుకొచ్చేందుకు మీ అందరి సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టి సారించి తాగు, సాగునీరు సమస్య తలెత్తకుండా శాస్వత పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని, ఆ దిశగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా వీటిని ప్రారంభిస్తామన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, నియోజకవర్గ పర్యటన ఉందని, ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా, పార్టీలకు అతీతంగా అందరూ అభివృద్ధి, ప్రగతి వైపు అడుగులు వేద్దామన్నారు. ఈ ప్రాంతంలో ఏమి అవసరమో దీనిపై ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పార్థసారథి రెడ్డి, మారెడ్డి జోగిరెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామమునిరెడ్డిట్టి, షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, వీరభద్ర, వేమాకుమార్, పివి రమణ, డక్కారమేష్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్లే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటి పేజీ తరువాయి)

మిగతా జిల్లాల్లోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని అంశాల్లో ప్రజాప్రతినిధుల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా నిత్య విద్యార్థిగానే ఉండాలని, నిరంతరం వివిధ అంశాలను తెలుసుకుంటూ అభివృద్ధిలో భాగస్వామి కావాలని చెప్పారు. కలెక్టర్ల సదస్సులో చర్చలు మొక్కుబడిగా సాగకుండా... అర్థవంతమైన సమీక్షలు, చర్చలు జరపాలన్నారు. ప్రజల్లో సంతృప్తిని పెంచేలా పౌరసేవలను అందించాలని కలెక్టర్లను కోరారు.

### ఫిర్యాదులన్నింటికీ పరిష్కారం చూపాలి

ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'ప్రజా పాలనలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుగా ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్సులను కూడా వేగంగా పరిష్కరించి పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఉంచండి. లిటిగేషన్లపై ప్రజల్లో చైతన్యం పెంచి వాటిని పరిష్కరించుకునేలా అవగాహన పెంచుదాం. నీటి సమస్యలు, మద్దతు ధరలు లేకపోవటం, భూ వివాదాలు, విద్యుత్ బిల్లులు ఎక్కువ రావటం లాంటి సమస్యలు కూడా గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా పెద్దఎత్తున వచ్చాయి. ఇప్పుడు మనం నీటి భద్రత తెచ్చాం, రైతులకు మెరుగైన ధరలు దక్కేలా చూస్తున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచకపోగా... తగ్గించాం. వ్యవస్థలో ఉండే లోపాలను అడ్డుగా పెట్టుకుని కొందరు పనిచేయకుండా తప్పించుకుంటున్నారు. రెవన్యూ శాఖలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఫైళ్లను పరిష్కరించుకుండా తమ వద్ద నుంచి వేరే వారికి పంపించేస్తున్నారు. ఇకపై ఫిర్యాదులన్నింటికీ పరిష్కారం చూపాలి. డేటా డ్రివెన్ గవర్నెన్స్ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతీ శాఖ ఆన్‌లైన్ ద్వారా ఫైళ్లు నడపాలి సేవలు అందించాలి. చేసిన పనిని సామాజిక మాధ్యమాల్లో అందరూ గొప్పగా చెప్పుకునే స్థాయిలో మన చర్యలు ఉండాలి.' అని అన్నారు.

### పరిపాలనలో పవన్, లోకేష్ భేష్

ఇళ్లు లేని పేదలు, రైతులు, మహిళలు, చిన్నారులు, యువత ఇలా అన్ని వర్గాలకు మంచి చేయడం ద్వారా ప్రజల్లో సానుకూలత వస్తుందని ముఖ్యమంత్రి సూచించారు. జీఎస్డీపీ, కేపీఐ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేలా చర్చించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల ద్వారా ఫలితాలు ఎలా వస్తున్నాయన్నదే ముఖ్యమని, మనం చక్కగా ప్రజలకు సేవలందిస్తున్నాం... కానీ మరింత సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. లోటుపాట్లను సవరించుకుంటేనే ప్రజల్లో సంతృప్తి వస్తుందన్నారు. 5,757 మందికి కానిస్టేబుళ్లుగా నియామక పత్రాలు ఇవ్వడం చాలా సంతోషమనిపించిందని సీఎం అన్నారు. నియామకపత్రం తీసుకున్న ఓ కానిస్టేబుల్ తన ఊరికి రోడ్డు లేదని ఉప ముఖ్యమంత్రికి సమాచారం అందిస్తే... అదే వేదిక నుంచి ఆ రోడ్డుకు రూ. 3.90 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఉప ముఖ్యమంత్రి వేరే రంగం నుంచి వచ్చినా... పరిపాలనలో చక్కటి పనితీరు కనబరుస్తున్నారని, మంత్రి లోకేష్ గూగుల్ డేటా సెంటర్ విశాఖకు తీసుకువచ్చారని ప్రశంసించారు. గత పాలకుల నిర్వాకం వల్ల నిర్వీర్యం అయిపోయిన కేంద్ర ప్రాయోజిత పథకాలన్నీ పునరుద్ధరించామని చెప్పారు.

### సూపర్ సిక్స్... సూపర్ సక్సెస్

'సూపర్ సిక్స్‌ను సూపర్ సక్సెస్ చేశాం. పేదలకు ఆర్థికంగా అండగా ఉండేందుకే సూపర్ సిక్స్ పథకాలను తీసుకొచ్చాం. సామాజిక భద్రత పెన్షన్లను మొదటి తేదీనే అందిస్తున్నాం. తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రెండు విడతల్లో ఒక్కో రైతుకు రూ.14 వేలు ఇచ్చాం. దీపం-2.0, స్త్రీశక్తి, మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాలు కూడా భర్తీ చేశాం. డ్వాక్రా, మెప్మాను ఇంటిగ్రేట్ చేస్తున్నాం. పెద్దఎత్తున గృహ నిర్మాణాలు చేపడుతున్నాం... అందరికీ ఇళ్లు అందేలా చేస్తున్నాం. పీ4 ద్వారా పేదలకు చేయూత అందించటమే లక్ష్యం. ప్రివెంటివ్, క్యురేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్ మేనేజ్మెంట్ ద్వారా వైద్యారోగ్యాన్ని ప్రజలకు అందించాలి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

### వేగంగా అనుమతులు మన లక్ష్యం

విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, అలాగే ఇప్పటివరకు రూ. 8.29 లక్షల కోట్ల పెట్టుబడులను ఎస్ఐపీబీ ద్వారా ఆమోదించామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ పెట్టుబడులతో 23 లక్షలకు పైగా ఉద్యోగాలు రాష్ట్రానికి వస్తాయని చెప్పారు. స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ హైడ్రోజన్ సిటీల ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని అన్నారు. వచ్చిన పెట్టుబడులకు అనుమతులు, భూ కేటాయింపుల విషయంలో కలెక్టర్లు కూడా వేగంగా స్పందించాలని సీఎం సూచించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి వచ్చామని... పెట్టుబడులు పెట్టేవారికి అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అన్నిరంగాల్లోనూ లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ అమలైతే జీఎస్డీపీలో 15 శాతం వృద్ధి సాధ్యమేనని సీఎం స్పష్టం చేశారు. నీటి భద్రత, ఉద్యోగాల కల్పన, అగ్రిటెక్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఈ వృద్ధిని సులభంగా సాధించవచ్చన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి సుస్థిరమైన పాలన అందిస్తున్నారని, ఇప్పుడు ప్రపంచం అంతా భారత్ గురించి ఆలోచన చేయకుండా ముందుకు వెళ్లటం లేదని సీఎం తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీకి వెన్నుముక ఐటీ రంగమని... ఇందుకు అవసరమైన ఐటీ నిపుణులకు రాష్ట్రంలో లోటు లేదన్నారు.

### పీపీపీలో నిర్మిస్తే ప్రైవేట్ పరం కాదు

జిల్లాల కలెక్టర్ల సమావేశంలో పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై సీఎం స్పష్టత ఇచ్చారు. పీపీపీ ద్వారా వైద్య సేవలు మరింత మెరగవుతాయని అన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేసేశారని కొందరు మాట్లాడుతున్నారని... అయితే పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడుతున్నా... అవి ప్రభుత్వ కళాశాలల పేరుతోనే నడుస్తాయని చెప్పారు. మెడికల్ కాలేజీల నిబంధనలు కూడా రాష్ట్ర ప్రభుత్వమే నిర్దేశిస్తుందని స్పష్టం చేశారు. 70 శాతం మందికి ఎన్టీఆర్ వైద్య సేవలు ఆయా కళాశాలల్లోనే అందుతున్నాయని, సీట్లు కూడా పెరిగినట్టు వివరించారు. రూ.500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించి డబ్బులు వృథా చేశారని, అవే డబ్బులతో రెండు మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయి ఉండేదని చెప్పారు. రుషికొండ ప్యాలెస్ నిర్వహణ ఇప్పుడు ప్రభుత్వానికి భారంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా పీపీపీ కింద ప్రాజెక్టులు చేపడుతోందని అన్నారు. రోడ్లను పీపీపీ ద్వారానే నిర్మిస్తున్నారని... అలాగని అది ప్రైవేటు వ్యక్తులది అయిపోతుందా అని సీఎం ప్రశ్నించారు. విమర్శలు చేస్తే భయపడేది లేదని, వాస్తవాలన్నీ ప్రజలకు తెలియ చేయాలన్నారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పులు చాలా ఉన్నాయని, జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉండేవారని సీఎం అన్నారు. 13, 14 శాతం మేర అత్యధిక వడ్డీలతో అప్పులు తెచ్చి సమస్యలు సృష్టించారని, అనాలోచిత విధానాలతో అనవసరపు ఖర్చు పెరిగిందన్నారు. ఇప్పుడు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికతో అప్పులు రీ-షెడ్యూలు చేస్తున్నామని సీఎం అన్నారు. చివరికి గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన 70 శాతం ధ్వంసమైన రోడ్లను కూటమి ప్రభుత్వంలో మరమ్మతులు చేసి, కొత్తగా రోడ్లు వేస్తున్నామని సీఎం వెల్లడించారు.

# నిబంధనలకు తిలోదకాలు


(మొదటి పేజీ తరువాయి)

క్రితం ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఇదే వైన్ షాప్ ఇళ్ల మధ్యలో వుందని, దీంతో మందు బాబులు తాగి వుగుతూ, కొంత మంది తూళూతు తమకు ఇబ్బందికరంగా మారిందని, కావున వెంటనే ఆ షాపును మహిళలు, పలువురు కాలేజీ రోడ్డు ఏరియా వాసులు తొలగించాలంటూ ఆందోళన చేపట్టారు. ఇళ్ల మధ్య వైన్ షాపు వెంటనే తొలగించాలంటూ ఏడాది క్రితమే మహిళలు, పలువురు స్థానికులు ఆందోళన వ్యక్తం చేసినా, నియోజక వర్గ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదంటూ మండిపాటు చేశారు. దీన్ని బట్టి చూస్తే ఆ వైన్ షాప్ యజమాని ఎంతటి ఘనుడో ఇప్పటికే అర్థమవుతుంది.

### మత్తులో ఎక్సైజ్ అధికారులు

కాగా ఇంత తతంగం జరిగినా, నేటికీ ఏదో రకంగా మహిళలు, పలువురు స్థానిక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నా పట్టించుకోవాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మాత్రం 'మత్తు' లో వున్నారని, అది నిద్ర మత్తా లేక మరోకటా అంటూ ప్రజలు బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఎక్కడ చూసినా మద్యం మత్తులో రోడ్లపై పడివున్న మందుబాబులే కనిపిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. కాగా ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు తమ తీరును మార్చి నిబంధనలు అతిక్రమిస్తున్న ఆ వైన్ షాప్ యజమాని పై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.... కాగా ఈ విషయమై ప్రొద్దుటూరు ఎక్సైజ్ సిఐ సురేంద్రనాథరెడ్డి వివరణ కోసం ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన ఫోన్ ఆన్సర్ చేయలేదు.

## రిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించిన వైసిపి స్టేట్ డాక్టర్స్ వింగ్ సెక్రెటరీ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్: కడప రిమ్స్ హాస్పిటల్ ని వైసీపీ రాష్ట్ర వైద్యుల విభాగపు సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, వైసిపి డిస్టిక్ డాక్టర్స్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జునరెడ్డి సందర్శించారు. హాస్పిటల్ లోని పలు వార్డులను పర్యటించి రోగుల తో మాట్లాడి అక్కడ అందిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడప వైసీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కళ్యాణ్ మాట్లాడుతూ వైయస్ రాజ శేఖర్ రెడ్డి స్థాపించిన రిమ్స్ వైద్య కళాశాల జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరమని కొనియాడారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవలు మెరుగుపరిచి పెండింగ్లో ఉన్న బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం సరికాదన్నారు. ఇందులో భాగంగా కోటి సంతకాలు కార్యక్రమం ద్వారా గవర్నర్ కి వైయస్ జగన్ సంతకాలు సేకరించిన పుస్తకాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్, డాక్టర్ పవన్ పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## పెన్షన్ సౌలభ్యాల చెల్లింపులో ప్రభుత్వ తీరు సరికాదు

### ఎస్టీయు నాయకుడు పి.రమణారెడ్డి



**కలసపాడు మేజర్‌న్యూస్:** పదవీ విరమణ చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆక్షేపణీయమని ఎస్టీయు నాయకుడు పి.రమణారెడ్డి పేర్కొన్నారు. కలసపాడులో రమణారెడ్డి మాట్లాడుతూ ముప్పై, నలభై సంవత్సరాలు ఉద్యోగ, ఉపాధ్యాయులుగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను,లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయడంలో విశేష సేవలు అందించి,పదవీ విరమణ చేసిన వారికి అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను అందించి సగౌరవంగా ఇంటికి సాగనంపాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందన్నారు. పదవీ విరమణ చెందిన తరువాత రావాల్సిన గ్రాట్యూటి, ఐ హాఫ్, పే లీవ్, ఎన్ క్యాష్మెంట్, జడ్పీపిఎఫ్, ఏపీజిఎల్ఐ ఫైనల్ పేమెంట్స్ చెల్లింపులు సంవత్సరాల తరబడి, నెలల తరబడి పెండింగ్ లో పెట్టడం ఎంతవరకు సబబో ఆలోచించాలన్నారు.పదవీ విరమణ చెందిన తరువాత వచ్చే మొత్తంతో ఏదైనా కుటుంబ అవసరాలు లేదా పిల్లల పెళ్లిళ్లు చేయాలనుకునే వారి కలలను ప్రభుత్వం కల్లలు చేస్తుందన్నారు. పెన్షనర్స్ దినోత్సవం రోజైనా ప్రభుత్వం స్పందించి,పెన్షనర్స్ ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులో చొరవ తీసుకుని చెల్లింపులు జరిపేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇలా సంవత్సరాల తరబడి చెల్లింపులు చేయకపోతే పెన్షనర్లు నడిరోడ్డున పడి దయనీయ పరిస్థితుల్లో బ్రతుకులు వెళ్లదీయవలసి వస్తుందన్నారు. పదవీవిరమణ చెందిన రోజే అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలతో పాటు పెన్షన్ మంజూరయ్యేలా ఒక నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# నిష్పాక్షికంగా నిగ్గు తేల్చిన నశీర్ అహమ్మద్

### ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** మన దేశ స్వాతంత్ర సమరంలో పాల్గొని ప్రాణాలర్పించిన ఎంతోమంది ముస్లిం వీరుల జీవిత చరిత్రలను సుదీర్ఘంగా పరిశీలించి నిగ్గు తేల్చిన సయ్యద్ నశీర్ అహమ్మద్ చరిత్రకారునిగా దేశ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడపలో బుధవారం ఆప్ కి అవాజ్ ఆధ్వర్యంలో హజ్రత్ అయిషా ఇంగ్లీషు మీడియం స్కూల్,జూనియర్ కాలేజీలో సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన 'అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ – షేక్ మదీనా' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కులాలకు,మతాలకు అతీతంగా ఎంతో మంది మహనీయులు పోరాటాలు చేశారని, మరుగున పడిన వారి జీవితాలను వెలికి తీసి వెలుగు చూపిస్తున్న నశీర్ అహమ్మద్ జీవితం ధన్యమైందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్. రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేసిన పజులుల్లా ఖాన్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చేసిన విప్లవ పోరాటంలో సహకరించిన వైనం మరుపు రానిదని, షేక్ మదీనా రామరాజుకు తుఫాకి కాల్చే విధానం నేర్పిన ఘనుడని అన్నారు. మరో విశిష్ట అతిథి ప్రముఖ కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ ప్రసంగిస్తూ మన దేశ చరిత్రను వక్రదృష్టితో కాకుండా ఉన్నది ఉన్నట్లు పరిశోధన చేస్తే మరెందరో ముస్లిం వీరుల జీవిత చరిత్రలు వెలుగు చూస్తాయన్నాని తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు సుల్తాన్ మైనుద్దీన్ మాట్లాడుతూ ఇంతవరకు చరిత్రపై అనేక మంది పుస్తకాలు రాసిన మరుగున పడిన ముస్లిం వీరుల చరిత్రను బయటకు తీస్తున్న నశీర్ నిజంగా అభినందనీయుడన్నారు. ఆత్మీయ అతిథి రియాజ్ మాట్లాడుతూ ఈ పుస్తకం మనదేశంలో వంద చోట్ల ఆవిష్కరిచబడడం నిజంగా గర్వకారణమన్నారు. ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ భాష ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గొప్ప చరిత్రకారుడు, చరిత్రకెక్కని వేలాదిమంది ముస్లింల త్యాగనిరతిని కొనియాడుతున్న నశీర్ అహమ్మద్ ఈ పుస్తకం కడపలో ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు

## ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గ్రామ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు




**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్:** ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం గ్రామ విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సు-వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంయుక్త వ్యవసాయ సంచాలకులు సి.బి. చంద్రనాయక్ హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే వ్యవసాయం మరియు అనుబంధ శాఖలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించడంతో పాటు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కే. అంకయ్య కుమార్ , ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కే. కృష్ణప్రియ , వ్యవసాయ పరిశోధన స్థానం నుండి డాక్టర్ సునీల్ రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి పంటల సాగు విధానాలు, తెగుళ్ళు, పురుగుమందుల వినియోగంపై సమగ్ర సమాచారం అందించారు. వ్యవసాయ కళాశాలలు తిరుపతి, మహానంది, ఉదయగిరి అసోసియేట్ డీన్లు మాట్లాడుతూ విద్యార్థులు%-%రైతులు కలిసి అనుభవాలను పంచుకొని మంచి దిగుబడులు ఎలా సాధించాలో నేర్చుకోవాలని సూచించారు. అలాగే సూక్ష్మ సేద్యం, డ్రోన్ స్ప్రేయింగ్ వంటి అధునాతన వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ విజ్ఞాన ప్రదర్శనల ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను వివరించారు. సహకార సంఘం చైర్మన్ గంధం మోహన్ బాబు మాట్లాడుతూ రేవత్ విద్యార్థులు ఎంతో కృషితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని అభినందించారు.ఈ రైతు సదస్సులో గ్రామ పెద్దలు, రైతులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అధ్యాపకుడు డా.శివ కృష్ణారెడ్డికి డాక్టరేట్



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన యానిమేషన్ విభాగం అధ్యాపకుడు డా.ఉండేల శివకృష్ణారెడ్డి చెన్నైలోని హిందుస్థాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (డీమ్డ్ టు బీ యూనివర్సిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. హిందుస్థాన్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సత్యదుర్గ,కె ఎస్.ఆర్.ఎం కాలేజ్ సీ.ఎస్.ఈ విభాగం ప్రొఫెసర్ వి. లోకేశ్వర్ రెడ్డి మార్గదర్శకత్వంలో "హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ద్వారా యానిమేటెడ్ వీడియోల క్వాలిటీ ఆఫ్ సర్వీస్ మెట్రిక్స్ అభివృద్ధి" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య బి. జయరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డా. ఉండేల శివకృష్ణా రెడ్డి మాట్లాడుతూ తన పరిశోధనలో భాగంగా వీడియో ప్రాసెసింగ్, కృత్రిమ మేధస్సు ఆధారిత అల్గారిథమ్స్‌ను వినియోగించి యానిమేషన్ వీడియోల నాణ్యతను మెరుగుపరిచినట్లు వివరించారు. ఈ పరిశోధనలో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో 10కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు. ఇదే అంశంపై ఈ విద్యా సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా వెలువడిన 52 పరిశోధన పత్రాలలో డా. ఉండేల శివకృష్ణా రెడ్డి పరిశోధన ఫలితాలు క్రోడీకరించబడటం విశేషం.ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. జయరామిరెడ్డి, యానిమేషన్ విభాగం విభాగాధిపతి దినేష్ కుమార్, ఇతర అధ్యాపకులు డా. శివకృష్ణా రెడ్డిని అభినందిస్తూ, భవిష్యత్ పరిశోధనా కార్యక్రమాలలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## యన్‌పీటీఈఎల్ పరీక్షల్లో కేఎల్‌ఎం విద్యార్థినుల విశేష ప్రతిభ



**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్ :** ఇటీవల విడుదలైన యన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో కేఎల్‌ఎం కళాశాలకు చెందిన విద్యార్థినులు విశేష ప్రతిభ కనబర్చి అత్యుత్తమ స్థాయి ఫలితాలు సాధించారు. సిఎస్ఈ మూడో సంవత్సరం చదువుతున్న పలువురు విద్యా ర్థినులు ఉత్తమ శాతాలతో ఉత్తీర్ణత సాధించడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. కే. మేరీ అనూష – 81 శాతం, ఏం. మమత – 81 శాతం, ఎస్. సాజిద – 85 శాతం, ఎస్. ముస్కాన్ ఆలియా – 83 శాతం, ఆర్. ప్రత్యూష – 83 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.ఈ సందర్భంగా కరెస్పాండెంట్ రాజేశ్వరి , మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే. చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఏం.వి. రత్నమ్మ, అలాగే అన్ని శాఖల విభాగాధిపతులు విద్యార్థినులను అభినం దిస్తూ వారి భవిష్యత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినుల కృషి, అధ్యా పకుల మార్గనిర్దేశంతో సాధించిన ఈ విజయాలు కే ఎల్ ఎం కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలి

### జీఓ 590 ఉపసంహరించాలి



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్, ప్రాంతీయ కార్యదర్శి బి.వి.రాములు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాల లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్(పిపిపి) విధానం ఏర్పాటు చేసేందుకు గత సెప్టెంబర్ 9న జీఓ 590ని జారీ చేసిందని, విద్య,వైద్య రంగాలను ప్రైవేటీకరణ దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా పావులు కదపడం దుర్మార్గమన్నారు. దీంతో వైద్య విద్య పూర్తిగా వ్యాపారం అవుతుందన్నారు. వైద్య సేవల్లో నాణ్యత తగ్గి, పేదవారికి ఉచిత సేవలు అందని ద్రాక్షగా మారుతుందన్నారు. అలాగే ఎస్సి, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలు 55 శాతం వైద్య విద్య సీట్లను కోల్పోవడంతో పాటు ఆ వర్గాల నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఎదురవుతాయని మండిపడ్డారు. దీనికి నిరసనగా నేడు సిపిఐ ఆధ్వర్యంలో కడపలోని కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బ్రహ్మం, అంజనప్ప, చాంద్ బాషా, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి: ప్రాణాన్ని కాపాడుకోండి

### పెండ్లిమర్రి పోలీసుల విజ్ఞప్తి



పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్ : మోటార్ సైకిల్ పై ప్రయాణించే ప్రతి ఒక్కరు ఇక తప్పక హెల్మెట్ ధరించాలని, ఇది మిమ్మల్ని మీ కుటుంబాన్ని కాపాడుతుందని, క్షేమంగా బయటికి వెళ్లి నీ పనులు చూసుకుని అంతే క్షేమంగా తిరిగి ఇల్లు చేరుకోవాలంటే దయచేసి ఇక తప్పక హెల్మెట్ ధరించాలని కోరారు.. ఈ మా విజ్ఞప్తి, మా హెచ్చరికలను బేఖాతరు చేస్తే పోలీసులు ట్రాఫిక్ చలానా విధిస్తారని కావున ప్రతి ఒక్కరు ఈ రోజు నుండి హెల్మెట్ తప్పక ధరించాలని కోరారు.. అలాగే పోలీసు వారు హెల్మెట్ ధరించి ఒక బృందంగా ఏర్పడి పురవీధులలో బైక్ పై ప్రదర్శన చేశారు.

## కడప జిల్లాలో యురేనియం కార్పొరేషన్ వ్యవహరిస్తున్న తీరుపై పార్లమెంటులో గళమెత్తిన కడప ఎం.పి.వైఎస్ అవినాష్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్:** దేశంలోనే అత్యధిక యురేనియం నిల్వలు నా పార్లమెంటు నియోజకవర్గం కడపలోనే ఉన్నాయి. గత 18 సంవత్సరాలుగా నా నియోజకవర్గంలోని తుమ్మలపల్లిలో యురేనియం కార్పొరేషన్ మైనింగ్, ప్రాసెసింగ్ ప్లాంటు నిర్వహిస్తోంది. జాతీయ అవసరాల నిమిత్తం ఆరు గ్రామాలకు చెందిన మా ప్రజలు తమ భూములను ఇచ్చారు. యురేనియం వల్ల తీవ్రమైన రేడియేషన్ సమస్యలు వస్తాయన్న ప్రచారం ఉన్నా వాళ్లు తమ భూములను అందించి త్యాగాలు చేశారు. కానీ యురేనియం కార్పొరేషన్ అక్కడి ప్రజలపై ఎటువంటి గౌరవం చూపడం లేదు. వారి సమస్యలు, ఫిర్యాదుల పట్ల ఎటువంటి చిత్తశుద్ధి చూపడం లేదు. టెయిలింగ్ పాండ్‌లోకి ప్రమాదకరమైన రసాయనాలు పంపుతున్నారని సంబంధిత మంత్రి గారి ద ృష్టికి నేను తీసుకొచ్చాను. టెయిలింగ్ పాండ్ ఉన్న కొట్టాల గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి వేరే చోటికి షిఫ్ట్ చేయాలని మంత్రి గారికి విన్నవించాను. అంతేకాకుండా భూసేకరణ, భూములు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చే అంశంలో ఇంకా సమస్యలు అలానే ఉన్నాయి. అక్కడ వారి ఆరోగ్య సమస్యలను కూడా లెక్కచేయకుండా భూములిచ్చిన రైతులు, ప్రజల త్యాగాలను ద ృష్టిలో ఉంచుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని కోరారు.

## కేయస్ఆర్‌యంలో జావా బ్యాక్‌ఎండ్ డెవలపర్ శిక్షణకు శ్రీకారం




**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్:** చింతకొమ్మదిన్నె మండలం కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఆటానమస్)లో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. "జావా బ్యాక్‌ఎండ్ డెవలపర్" అంశంపై నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిక్షణను కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఇండియా మరియు ఐసీటీ అకాడమీ, చెన్నై సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ శిక్షణ కార్యక్రమం డిసెంబర్ 17, 2025 నుంచి జనవరి 09, 2026 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఐసీటీ అకాడమీ రాయలసీమ జోన్ రీజినల్ మేనేజర్ నాగేశ్వరయ్య మాట్లాడుతూ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపకల్పన చేసిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆధునిక జావా ప్రోగ్రామింగ్, బ్యాక్‌ఎండ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, డేటాబేస్ ఇంటిగ్రేషన్, రియల్ టైమ్ ప్రాజెక్ట్ అవగాహన వంటి కీలక నైపుణ్యాలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే అధ్యాపకులకు కూడా తాజా టెక్నాలజీలపై శిక్షణ అందించడం ద్వారా బోధన నాణ్యతను మరింత మెరుగుపర్చే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టీ.ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ, పరిశ్రమ–విద్యా సంస్థల మధ్య సమన్వయం ద్వారా విద్యార్థుల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, ఇటువంటి సీఎస్ఆర్ కార్యక్రమాలు విద్యార్థులను భవిష్యత్ ఐటీ సవాళ్లకు సిద్ధం చేస్తాయని అన్నారు. కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఇండియా మరియు ఐసీటీ అకాడమీ రిసోర్స్ పర్సన్ సీ.హెచ్. అభినయ్ మాట్లాడుతూ, గ్రామీణ మరియు పట్టణ విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలతో ముందుకు సాగి, ఐటీ రంగంలో ఉన్నత స్థాయిలో భవిష్యత్తులో నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి, ఐక్యూఏసీ డీన్ డాక్టర్ విజయ కిశోర్, కాలేజ్ ఐసీటీ కోఆర్డినేటర్ పి. సురేష్ ప్రవీణ్, ప్రోగ్రాం స్పోక్ బీ. శ్వేత, మెంటార్స్ మనోరమ, లావణ్య, ఐస్‌రజాక్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## దువ్వూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన

### ఎంఈఓ రమణయ్య



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన దువ్వూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన విజయవంతంగా నిర్వహించబడిందని మండల విద్యాశాఖ అధికారి రమణయ్య తెలిపారు. బుధవారం జడ్పీ హైస్కూల్ నందు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.ఈ.ఓ రమణయ్య హాజరై, విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత మరియు నైపుణ్యాలను పెంపొందించడంలో ఇవి ఎంతగానో దోహదపడతాయని తన ప్రసంగంలో తెలిపారు. అదేవిధంగా, జెడ్పిహెచ్ఎస్, దువ్వూరు ప్రధానోపాధ్యాయులుఏ. శ్రీనివాసులు కూడా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థుల ప్రదర్శనలను అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. దువ్వూరు మండలానికి చెందిన మొత్తం 8 పాఠశాలలు తమ శాస్త్ర ప్రాజెక్టులతో ఈ శాస్త్ర ప్రదర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులు తమ తమ ప్రాజెక్టులను స్పష్టంగా మరియు వివరంగా వివరించి, తమ అవగాహనను చక్కగా ప్రదర్శించారు.అదనంగా, జెడ్పిహెచ్ఎస్ పుల్లారెడ్డిపేట, కేజీబీవీ మరియు జెడ్పిహెచ్ఎస్ దువ్వూరు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు శాస్త్ర ప్రదర్శనను సందర్శించి, శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు హాజరైనా అధికారులు మరియు ఉపాధ్యాయులనుండి విద్యార్థులు ప్రశంసలు అందుకున్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

### తహశీల్దార్ సంజీవరెడ్డి



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన దువ్వూరులోని బైపాస్ రోడ్డు సమీపంలో 371/4 సర్వే నెంబరులో ఉన్న 70 సెంట్ల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడితే నిర్మాణ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల తహశీల్దార్ సంజీవరెడ్డి హెచ్చరించారు. బుధవారం వీఆర్వో మునిస్వామి, వీఆర్ఏ సుబ్బమ్మ 371/4 సర్వే నెంబర్ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వ భూమిలో ఎవ్వరైనా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## గాంధీ పేరు తొలగింపు దుర్మార్గం


### కాంగ్రెస్ రాష్ట్ర నేత డా.తులసిరెడ్డి



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** జాతీయ ఉపాధి హామీ పథకం నుండి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గాంధీ పేరు ని తొలగించడం దుర్మార్గం అని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్.తులసిరెడ్డి ఘాటుగా స్పందించారు. దీనికి నిరసనగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి పోగాలం, దాపురించిందని, పతనానికీ కౌంట్ డౌన్ ప్రారంభమైందన్నారు. ఉపాధి హామీ పథకం పల్లె ప్రజల పాసుపతాస్త్రమని, ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి హామీ పథకం అన్నారు. ఈ పథకాన్ని 2005లో సోనియా గాంధీ మార్గదర్శకత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఈ పథకం నెరవేరుస్తున్న నైపథ్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని పేరు పెట్టారన్నారు. ఆ పేరు మార్పుపై తెలుగుదేశం, జనసేన మద్దతు ఇవ్వడం శోచనీయం అన్నారు. కేంద్రం పునరాలోచన చేసి, ఆ పేరు తో పాటు 90 శాతం నిధులిచ్చేలా కొనసాగించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, నియోజకవర్గ ఇంచార్జీ ధృవకుమార్ రెడ్డి, నాయకులు రామక ృష?, రామాంజీరెడ్డి, వెంకటేష్, జిలాని, సాయిరెడ్డి, అమర్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, వెంకటేశు, వేమారాజా తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

### 2 టౌన్ సిఐ వంశీనాథ్




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని 2 టౌన్ సిఐ వంశీనాథ్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరు 2 టౌన్ సిఐగా బుధవారం వంశీనాథ్ బాధ్యతలు చేపట్టారు. దేవనకొండ నుండి ఆయన బదిలీపై ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చారు. ఇక్కడ 2 టౌన్ సిఐగా వున్న సదాశివయ్య కడప 2 టౌన్ సిఐ గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన వంశీనాథ్ మాట్లాడుతూ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కృషి చేస్తానని తెలిపారు. మట్కా, బెట్టింగ్, జూదం వంటి కార్యకలాపాలు ఎక్కడైనా జరిగితే ప్రజలు తమకు సమాచారం అందించి అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు సహకరించాలని వివరించారు.

## ప్రకృతి వ్యవసాయ పొలాలను సందర్శించిన వ్యవసాయ సిబ్బంది







**లింగాల మేజర్ న్యూస్ :-** పులివెందులలో ఐదు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించారు. అందులో రెండవ రోజున పొలాల సందర్శనలో భాగంగా ఈరోజు లింగాల మండలం లోని అక్కులు గారి పల్లి, చిన్న కుడాల గ్రామాలలో ఐదవ బ్యాచ్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది 60 మంది క్యాడర్ లకుర్ డి ఎస్, ఏ గ్రేడ్ క్వాలిటీ ఇన్పుట్స్ మీద పెద్ద మొత్తం లో డెమోలు ఘనజీవమృతం 500 కేజీలు,అక్కులు గారిపల్లి యశోదమ్మ తయారు చేసి చూపడం జరిగింది.అదేవిధంగా ఎటిఎం, మోడల్ను చిన్న కుడాల మోహన్ రెడ్డి పొలంలో వేయడం జరిగింది. ఫీల్డ్ స్థాయి అందరూ దీనిని క్షుణ్ణంగా పరిచీలించి నేర్చుకున్నారు. అదే విదంగా విశ్వేశ్వర రెడ్డి అక్కులు గారి పల్లి అనే రైతు ప్రధాన పంట చీని 6 ఎకరాల్లో ఐదు సంవత్సరాలు గా పి ఎం డి ఎస్,ర్ డి ఏస్, లు వేస్తున్నారూ, ఈ రైతు యొక్క అనుభవం ఎప్పుడు రబి డ్రై షోయింగ్ అవలంచిచారు.అన్నది రైతు వివరించారు., అక్కడ రైతులు, సిబ్బంది గమనించిన అంశాలపై వివరణ భూమి లో నీటి వినియోగం తగ్గింది నీటిని పట్టి ఉంచేనేల స్వభావం బాగా ఉన్నది, అదే విదంగా భూమి బాగా గుల్లబారి కార్బనశాతం పెరిగి ఉన్నది, అని తెలియజేస్తూ ప్రధాన పంటకు కావలసిన అన్ని రకాల స్థూల, సూక్ష్మ పోషకాలు బాగా ఉన్నాయి, అని గమనించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్ ఫ్ ఏ, నరసింహారెడ్డి, యూనిట్ ఇన్చార్జి జయ నాయక్, ఐసీర్ పీ లు పి. రవి, యశోద, వి జయలక్ష్మి రైతు మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, బి ర్ సి,ఓనర్ ఉదయ్ కృష్ణారెడ్డి, శివరంజని,,మరియు 5 వ బ్యాచ్ సిబ్బంది మరియు వి హెచ్ ఎ, రైతులు, హాజరు కావడం జరిగింది.

# పార్టీ కొరకు కష్టపడే వారికి ప్రత్యేక గుర్తింపు

### కమిటీ సభ్యులు సైనికుల్లా పనిచేయండి - ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి

పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ : పోరుమామిళ్ల పట్టణంలోని మూడవ సచివాలయం పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదవుల నియామక కార్యక్రమం జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు రాజీవ్ బాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై అనంతరం ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులకే పూర్తి ప్రాధాన్యత ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కమిటీ సభ్యులకు అన్ని విధాలా పూర్తి ప్రాధాన్యత కల్పిస్తామని, అందుకే గ్రామ, వార్డు, సచివాలయ కమిటీల వ్యవస్థను వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం ప్రవేశ పెట్టారని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు కార్యకర్తలే పార్టీకి బలంగా నిలిచే కమిటీ వ్యవస్థను నిర్మించామని, రాష్ట్రస్థాయి నాయకుల నుంచి గ్రామ స్థాయి నాయకుల వరకు అందరూ కమిటీ సభ్యులను గౌరవించి ప్రోత్సహిస్తారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు సైనికుల్లా పనిచేసి ప్రతి గ్రామంలో వైఎస్సార్సీపీ జెండాను ఎగురవేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులకు ఏ సమస్య వచ్చినా పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సచివాలయ అధ్యక్షుడిగా రాజీవ్ భాషా, బీసీ విభాగ అధ్యక్షుడిగా డేరంగుల గురయ్యా, రైతు విభాగ అధ్యక్షుడిగా పోతుగంటి చిన్న పీరయ్య, మైనారిటీ విభాగ అధ్యక్షుడిగా సుంకర ఇషాక్, మహిళా విభాగ అధ్యక్షురాలిగా దండు షబానా పర్వీన్, యువజన విభాగ అధ్యక్షుడిగా బొజ్జ శ్రీనివాసులు, విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా పటాన్ ఆరిఫ్, సోషల్ మీడియా బాధ్యతగా కొత్త నరేష్ ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సచివాలయ మరియు గ్రామ కమిటీ సభ్యులను ఎమ్మెల్సీ అభినందించారు. గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలనే దృష్టితో పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ ఈ కమిటీ వ్యవస్థను తీసుకువచ్చారని, రాష్ట్రంలో తొలిసారిగా కమిటీ నిర్మాణ




ప్రక్రియను కడప పార్లమెంట్ పరిధిలోని బద్వేలు నియోజకవర్గంలో ప్రారంభించడం గర్వకారణమని అన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ అభిమానులు, చురుకైన కార్యకర్తలను గుర్తించి కమిటీల్లో చేర్చాలని సూచిస్తూ, ఈ కమిటీల వివరాలు నేరుగా జగనన్న కు పంపుతామని, సంక్రాంతి కల్లా పార్టీ గుర్తింపు కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు. జగనన్న 2.0లో కార్యకర్తలే పరిపాలనలో కేంద్రబిందువుగా ఉంటారని, రాబోయేది జగనన్న ప్రభుత్వమే అని విశ్వాసం వ్యక్తం చేస్తూ, 18 నెలల కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించి, పేదల పక్షాన పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షులు సీఎం భాష, చెన్ను రాజశేఖర్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ రాళ్లపల్లి నరసింహులు, జిల్లా మేధావులు విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాజులపల్లె రవిచంద్రారెడ్డి, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పొదిలి మస్తాన్ మనీ, ఎంపీటీసీలు ఇషాక్, గురప్ప, బూత్ కన్వీనర్ షరీఫ్, రెండో సచివాలయం అధ్యక్షుడు హుస్సేన్ పీరా, వార్డు మెంబర్ గురయ్యా, వార్డు మెంబర్లు నాయబ్ రసూల్, మహబూబ్ బాషా, దాదాహయాత్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కర్ర సాము పోటీల్లో సత్తా చాటిన హేమ వర్షిత



**చెన్నూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని శివాలపల్లి గ్రామానికి చెందిన జమకల సుబ్బారాయుడు,ఈశ్వరమ్మ ద్వితీయ కుమార్తె జమకల హేమ వర్షిత పాఠశాల క్రీడలలో భాగంగా రాష్ట్ర స్థాయి కర్ర సాము పోటీల్లో అద్భుత ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచింది.ఇటీవల 13,14న గుంటూరులోని వెనిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయింది.కర్ర సాములో జాతీయస్థాయి పోటీలకు తమ కుమార్తె ఎంపిక కావడం పట్ల చాలా సంతోషంగా ఉందని తల్లితండ్రులు జమకల సుబ్బారాయుడు,ఈశ్వరమ్మ ఆనందం వ్యక్తం చేశారు.తమ కుమార్తె ఇంత స్థాయికి రావడానికి కారణమైన కేఎస్ కలరి అకాడమీ కోచ్ జయచంద్ర కు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. చిన్న వయసులోనే కర్ర సాములో ఆసక్తి పెంచుకొని కోచ్ ద్వారా కఠిన సాధనతో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.జాతీయ స్థాయికి ఎంపికైన తమ కుమార్తె ఢిల్లీలో జనవరి 21 తేదీ నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తల్లితండ్రులు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## బదిలీ పొందిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

### ఆర్జేడికి యుటియఫ్ కడప జిల్లా శాఖ వినతి



చెన్నూరు మేజర్ న్యూస్: ఇటీవల బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్,పాలెం మహేష్ బాబు కోరారు.బుధవారం సాయంత్రం కడపలోని ఆర్జేడి కార్యాలయంలో ఆర్జేడి శామ్యూల్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 మే, జూన్ నెలల్లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల అనంతరం అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి బదిలీ పొందిన ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారని అనేక ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో 10వ తరగతి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని తెలిపారు.విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న వేళ ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి ప్రభుత్వం అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించుటకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఎందుకు ఆలస్యమవుతున్నదో తెలపాలన్నారు.దీంతోపాటు రిలీవ్ కానీ ఉపాధ్యాయుల సంఖ్య కనుగుణంగా అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను మంజూరు చేయకుండా నామమాత్రంగా కేటాయించడం తగదన్నారు. నాన్ రిలీవ్ టీచర్ల సంఖ్య మేరకు నియమకాలు చేపట్టాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను వెంటనే నియమించి బోధనకు ఆటంకం లేకుండా చూడాలని అకడమిక్ ఇన్స్ట్రక్టర్లు చేరిన వెంటనే రిలీవ్ కానీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## తేనెటీగల దాడిలో వృద్ధుడు మృతి




**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని టంగుటూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన చెందిన గూడూరు వెంకటయ్య(67) అనే వృద్ధుడు తేనెటీగల దాడిలో మృతి చెందాడు గ్రామం సమీపంలోనికుందూనది వద్దకు కట్టెలు తెచ్చుకునేందుకు వెళ్ళగా అక్కడే ఉన్న పెద్ద తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో వెంకటయ్య అక్కడే స్పృహ తప్పి కింద పడిపోయాడు ఈ విషయాన్ని అక్కడ ఉన్నవారు వెంకటయ్య కుటుంబీకులకు తెలపగా ఆ వృద్ధుడిని చికిత్స నిమిత్తం నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రి లోని ప్రైవేటుఆసుపత్రికి తరలించారు అక్కడేచికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు

## ముద్దనూరు సిఐగా నాగేష్ బాబు



ముద్దనూరు, మేజర్‌న్యూస్: ముద్దనూరు పోలీస్ స్టేషన్ సిఐగా నాగేష్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

## పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



**పులివెందుల మేజర్‌న్యూస్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి కడప ఎంపీ వై ఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కమిటీల ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల మాదిరి పని చేయాలని మున్సిపల్ ఇంచార్జ్ మనోహర్ రెడ్డి చైర్మన్ వర ప్రసాదులు అన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ కమిటీలను ఎన్నుకోవడం వల్ల పార్టీని వార్డు గ్రామస్థాయి నుంచే అనుకూలంగా ఉంటుందన్నారు కార్యకర్తలు పార్టీ నాయకులు కూడా కష్టపడి పనిచేసి పార్టీని బలోపేతం చేసే విధంగా చూడాలన్నారు. 2029లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి రెండోసారి చేసుకునేందుకు కార్యకర్తలు అంతా కష్టపడి పనిచేయాలన్నారు.. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ వైఎస్ఆర్సిపి పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రమౌళి నూరుల్లా కనక కోడి రమణ పాస్టర్ రామకృష్ణ నిరంజన్ టైటస్ కేకే రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బాబావల్లి సత్తార్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మాజీమంత్రి డియల్ రవీంద్రారెడ్డి, సీఐ వంశీధర్ చేతుల మీదుగా పుస్తక ఆవిష్కరణ



**ఖాజీపేట మేజర్‌న్యూస్:** ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మాజీ మంత్రి డి.ఎల్. రవీంద్రారెడ్డి నివాసంలో సయ్యద్ నశీర్ అహ్మద్ రచించిన “అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ షేక్ మదీనా” అనే చారిత్రక గ్రంథం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో డి.ఎల్. రవీంద్రారెడ్డి చేతులు మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో సి.ఐ. వంశీధర్ చేతులు మీదుగా కూడా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజుకు అండగా నిలిచిన ముస్లిం యోధుల పాత్రను ఈ గ్రంథం స్పష్టంగా తెలియజేస్తుందని అన్నారు. చరిత్రలో మరుగున పడిన అంశాలను వెలుగులోకి తీసుకు రావడంలో ఇటువంటి రచనలు కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు, సూక్ష్మ నిర్మాణాల కళాకారులు షేక్ హాజీ గౌస్, కడప జిల్లా మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, టైలర్ అసోసియేషన్ సభ్యులు ముహమ్మద్ హుస్సేన్, రచయిత ఇంతియాజుద్దీన్, ఇమామ్ భాష, డాక్టర్ ఆసిఫ్, యెలిశెట్టి సుధాకర్, వార్డు మెంబర్ మీసాల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వల్లూరులో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ విజయవంతం

**వల్లూరు మేజర్ న్యూస్:** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించాలనే ఉద్దేశంతో వల్లూరు మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వల్లూరులో విజయవంతంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు, సైన్స్ ఫెయిర్‌లో పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, శక్తి వనరులు, ఆధునిక సాంకేతిక వ్యవసాయం వంటి విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి, విద్యార్థులు తమ ప్రాజెక్టుల ద్వారా సమాజంలో ఉన్న సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను వివరించి అందరినీ ఆకట్టుకున్నారు, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి సైన్స్ ఫెయిర్లు విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

### రక్తదానం చేసిన అభిమానులు



**పులివెందుల, మేజర్‌న్యూస్:** కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల 51వ జన్మదిన వేడుకలను పులివెందుల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస హాల్ సమీపంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్ షర్మిల పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.. సందర్భంగా వైఎస్ షర్మిల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు సుమారు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు రక్తదానం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఇలాంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

## తిరుమలకు పాదయాత్ర



**పులివెందుల, మేజర్‌న్యూస్:** పులివెందుల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. సుమారు వందమంది గ్రామస్తులు తిరుమలకు పా యాత్రను ప్రారంభించారు. కొత్తపల్లి పులివెందుల వేంపల్లి రాయచోటి పీలేరు మీదుగా తిరుపతికి కాలినడక మార్గాన 5 రోజులకు చేరుకొని అక్కడ వెంకటేశ్వర స్వామికి తమ ముక్కులు తీర్చుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు

## అఖిల భారతరెడ్డి సంఘంను జిల్లా లో బలోపేతానికి కృషి చేయాలి

**- రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి**
**- జిల్లా అధ్యక్షులు మంచాల రాజశేఖర్ రెడ్డి**



దువ్వూరు, మేజర్ న్యూస్ : అఖిలభారత రెడ్డి సంఘంను జిల్లా లో బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు మంచాల రాజశేఖర్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం అఖిలభారత రెడ్డి సంఘం జిల్లా రైతు విభాగం కార్యదర్శిగా దువ్వూరు మండలం మూడిండ్ల పల్లె గ్రామానికి చెందిన మంచాల సుధాకర్ రెడ్డి , అలాగే జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా మండలంలోని బల్లకివారిపల్లె గ్రామానికి చెందిన యనమల రవీంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన పొలిమేర అమర్నాథ్ రెడ్డి లను నియమించిట్లు రాష్ట్ర, జిల్లా ల అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి, రాజశేఖరరెడ్డి లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి సంఘములో ఆయా విభాగాల్లో పదవులు పొందిన వారికి అభినందనలు తెలియజేశారు. వీరి నాయకత్వంలో రెడ్డి యువత, మహిళలు ఐక్యంగా ముందుకెళ్లి సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. రెడ్డి సమాజ ఐక్యమే తమ బలం అని, మీ సేవా ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## అబార్షన్ వివరాలపై ఆడిట్



**పులివెందుల,మేజర్‌న్యూస్:** పులివెందుల నియోజకవర్గంలోని లింగాల చక్రాయపేట సంతకోవూరు వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో అబార్షన్ లు మెడికల్ నిబంధన ప్రకారం జరిగాయ లేదా అనే దానిపై డిప్యూటీ డిఎంహెచ్వో ఖాజా మొద్దీన్ సర్వేజనా ఆస్పత్రి వైద్యురాలు అనన్య ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు పులివెందులలోని మినీ సెక్రటేరియట్ లో ఉన్న కార్యాలయంలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని గ్రామాలలో నిబంధనలు ప్రకారం అబార్షన్లు జరిగాయా లేదని అడిగి తెలుసుకున్నారు. అబార్షన్లు కూడా సక్రమంగా చేశారా లేదా అని వారికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు కార్యక్రమంలో ఆశ వర్కర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


## గ్రామాలలో ఉపాధి పనులు గుర్తించండి

### ఎంపీడీవో సుబ్బారెడ్డి




**దువ్వూరు, మేజర్‌న్యూస్:** జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీలకు మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు గుర్తించాలని ఉపాధి హామీ సిబ్బందికి మండల అభివృద్ధి అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో ఉపాధి హామీ ఎపిఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి పనులు గుర్తించాలని సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్, ఫారం ఫండ్స్ పనులను గుర్తించాలని తెలిపారు. అలాగే మండలంలో ఉపాధి కూలీలకు ఏకేవైసీ ప్రతి ఒక్కరికి చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ ఇందిరా ప్రియాంక, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫించనర్స్ కార్యాలయంలో ఫించనర్స్ డే వేడుకలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక తాలూకా ఆఫీస్ ప్రాంగణంలో ప్రొద్దుటూరు పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న పెన్షనర్స్ దంపతులకు విశిష్ట అతిధులచే ఘనముగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య, ట్రాఫిస్ ఇన్ స్పెక్టర్ రాజాగాపాల్, అసోషియేషన్ ప్రెసిడెంట్ దస్తగిరిరెడ్డి, సెక్రెటరీ వెంకటయ్య యాదవ్, ప్రొద్దుటూరు ఎన్జీవో ప్రెసిడెంట్ రామసుబ్బయ్య, తహశీల్దార్ గంగయ్య, ప్రొద్దుటూరు సబ్ ట్రెజరీ అధికారి తిరుపతి స్వామి, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పాలగిరి బసివిరెడ్డి, ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ భూమిరెడ్డి వెంకట సుబ్బయ్య, రిటైర్డ్ ప్రిన్సిపల్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ వంకదార కళావతి, ప్రొద్దుటూరు ఎన్జీవో సెక్రెటరి ఇ. ప్రమీల, ట్రెజరర్ సి. సదాశివయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కృషి

### త్రీ టౌన్ సిఐ రామాంజనేయుడు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కృషి చేస్తానని త్రీ టౌన్ సిఐ రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన త్రీ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కృషి చేస్తానని, ఇందుకోసం ప్రజల సహకారం అవలరమన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐ వేణుగోపాల్ బదిలీపై దేవనకొండ కు వెళ్లగా అన్నమయ్య ఎస్సీ ఎస్టీ సెల్ నుండి రామాంజనేయులు బదిలీపై ప్రొద్దుటూరు కు విచ్చేశారు.

## మైదుకూరు పిహెచ్‌సిలో అబార్షన్ కేసుల పై ఆడిట్



**మైదుకూరు, మేజర్‌న్యూస్:** మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నవంబర్ నెలలో నమోదైన అబార్షన్ కేసుల వివరాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిప్యూటీ డిఎంహెచ్ఓ) డాక్టర్ వి. మల్లేష్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వి. సుధా గారి ఆధ్వర్యంలో ఈ ఆడిట్ కార్యక్రమం జరిగింది. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, అబార్షన్ కేసుల్లో ప్రభుత్వం సూచించిన నిబంధనలు మరియు పద్ధతులు ఖచ్చితంగా అమలయ్యేలా చూడటమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశమని అధికారులు స్పష్టం తెలిపారు. ఈ సందర్భంగా నవంబర్ నెలలో జరిగిన అబార్షన్స్ కేసుల రికార్డులను, రోగులకు అందించిన సేవల నాణ్యతను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ( పిహెచ్‌సి) సూపర్‌వైజర్లు, ఏ.ఎన్.ఎం మరియు ఆశలు సిబ్బంది పాల్గొన్నారు.

## తొండూరు మండల స్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన




**తొండూరు మేజర్‌న్యూస్:** జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని తొండూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు 9 థీమ్‌ల విభాగంలో 30 ప్రాజెక్టులను స్టాల్స్‌గా ఏర్పాటు చేశారు.తొండూరు జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రవీణ్,వెంకట సుబ్బయ్యలు జడ్జిలుగా వ్యవహరించారు. వ్యవసాయం థీమ్ లో తొండూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు రవికృష్ణ మరియు భార్గవ్‌ల డ్రిప్ సిస్టం ప్రాజెక్టు, వ్యర్థ పదార్థాల నిర్వహణ మరియు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయం థీమ్‌లో తొండూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు షర్మిల, హర్షవర్ధన్‌ల ప్రాజెక్ట్, గ్రీన్ ఎనర్జీ థీమ్‌లో ఇనగలూరు ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థినిలు జలజ, నవీనాల ప్రాజెక్టు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత థీమ్ లో తుళ్లూరు ఉన్నత పాఠశాలకు చెందినఎనిమిదో తరగతి విద్యార్థులు సాయి అరుణ్ తేజ్ మరియు ప్రశాంత్‌ల ప్రాజెక్టు వినోద గణిత నమూనా థీమ్ లో ఇనగలూరు ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులు నరేంద్ర మరియు వంశీకృష్ణాల ప్రాజెక్టు ఆరోగ్యం పరిశుభ్రత టీం లో ఆరోగ్యం మరియు పరిశుభ్రత థీమ్ లో మల్లెల ఉన్నత పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులు అనిత మరియు సుమతి ల ప్రాజెక్టు నీటి సంరక్షణ మరియు నిర్వహణ థీమ్ లో ఇనగలూరు ఉన్నత పాఠశాలకు చెందిన బ్రహ్మాహిత ప్రాజెక్టు వ్యక్తిగత ప్రాజెక్టు విభాగంలో తొండూరు ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జయలక్ష్మి ,అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని తేజశ్రీ ల ప్రాజెక్టు, ఉపాధ్యాయుల ప్రాజెక్టు విభాగంలో ఇనగలూరు ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు జగన్మోహన్ రావు ల ప్రాజెక్టులు ఈనెల 20వ తేదీన కమలాపురం లో జరిగే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన -2025 ఎంపిక అయ్యారని మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## భూపేష్ రెడ్డికి అభినందనలు తెలిపిన రితీష్ రెడ్డి



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన యువనేత, సోదరులు శ్రీ చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి కి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి రితీష్ రెడ్డి అభినందనలు తెలిపారు.అధిష్టానం నమ్మకాన్ని నిజం చేస్తూ, 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మీ నాయకత్వంలో కడప జిల్లాలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీ పార్టీ ని అదేవిధంగా పార్టీ తరపున నిలబడే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి అధిక స్థానాలలో మన పార్టీ అభ్యర్థులను గెలిపించి విజయభేరి మోగిస్తామని ఆయన తెలిపారు .

## రాష్ట్రస్థాయి కర్ర సాములో వేదాస్ విద్యార్థుల జోరు

**అండర్ 17 గోల్డ్‌తో జాతీయస్థాయికి రోహిత రాయల్ ఎంపిక**
**అభినందించిన - ప్రిన్సిపాల్ ధీరజ్..**




**వల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఉన్న వేదాస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ రాష్ట్రస్థాయి కర్ర సాము పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు, అండర్-17 విభాగంలో ఎన్. రోహిత్ రాయల్ రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం, అలాగే బి. హేమ వర్షిణి, నాగచైతన్య, కమలాపురం పరిధిలో బ్రాంచ్ లోని లతీష్ లు వివిధ విభాగాల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు, జనవరి 21న ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో మన జిల్లా తరపున రోహిత రాయల్ పాల్గొననున్నారు, ఈ సందర్భంగా కోచ్ జయచంద్ర మాట్లాడుతూ నిరంతర సాధన, క్రమశిక్షణే ఈ విజయానికి కారణం, జాతీయ స్థాయిలోనూ రోహిత్ మెరవాలన్నారు, వేదాస్ కరస్పాండెంట్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఇలాంటి ఫలితాలు వస్తున్నాయి అని అభినందించారు, ప్రిన్సిపాల్ ధీరజ్ మాట్లాడుతూ విద్యార్థుల విజయాలు వేదాస్‌కు గర్వకారణం, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలు చేరాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు..

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించిన ఆర్డిఓ ఏ చంద్రమోహన్.



**కాశినాయన, మేజర్‌న్యూస్:** కాశినాయన మండలంలోని కొండరాజు పల్లి గ్రామానికి చెందిన రైతు కుమారి రమణయ్య ఇటీవల ఆత్మహత్యకు గురి అయ్యారు .ఈ విషయం తెలుసుకున్న సంబంధిత వ్యవసాయ శాఖ అధికారి మురళీధర్ రెడ్డి మరియు ఆర్డీవో చంద్రమోహన్ కలసి రైతు కో మారి ,రమణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన వ్యవసాయ శాఖ ఏడి తో మాట్లాడుతూ ఎందుకు రైతు ఆత్మహత్యలకు గురవుతున్నారు. పంట నష్టం ఎందుకు వస్తుంది. ఏ పంటలు వేస్తున్నారు. వాటిలో ఎందుకు దిగుబడి రావడం లేదు, వీటన్నింటి పైన వ్యవసాయ శాఖ అధికారులతో కలసి చర్చించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని కి ఊరటను భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకటసుబ్బయ్య, ఆర్ ఐ. అమర్నాథ్ రెడ్డి వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాతో మరింత సమర్ధవంతంగా పోలీస్ విధుల నిర్వహణ

**యు.సి.ఐ.ఎల్ తరపున జిల్లా పోలీస్ శాఖకు రెండు అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వితరణగా అందచేసిన కంపెనీ ప్రతినిధులు.**



**కడప క్రైమ్ మేజర్ న్యూస్:** శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ, ఇతర పోలీసింగ్ అవసరాల కొరకు వేముల మండలంలోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యు.సి.ఐ.ఎల్) తరపున రూ. 3 లక్షల విలువైన రెండు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరాలను జిల్లా ఎస్.పి నచికేత్ విశ్వనాథ్ కు కంపెనీ ప్రతినిధులు అందచేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్) లో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి కంపెనీ జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్ అందచేశారు. ఈ రెండు అత్యాధునిక డ్రోన్లను పులివెందుల సబ్ డివిజన్ లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో వినియోగించేందుకు పులివెందుల డి.ఎస్.పి బి.మురళి కి అందచేశారు. తమ వంతు సామాజిక బాధ్యతలో భాగంగా పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరాలను అందచేసినందుకు కంపెనీ యాజమాన్యానికి జిల్లా ఎస్.పి గారు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, జూద కార్యకలాపాలు, బహిరంగ మద్యపానం ఎక్కడ జరిగినా డ్రోన్ టెక్నాలజీతో పసిగడతామని, ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, పోలీసులకు ఒక "డేగ కన్ను" లాగా ఉపయోగపడతాయని ఎస్పీ తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సహకారంతో నేర నియంత్రణ మరింత సమర్థంగా నిర్వహించగలమన్నారు. కార్యక్రమంలో పులివెందుల డి.ఎస్.పి బి.మురళి, ఆర్.కె వ్యాలీ సి.ఐ ఉలసయ్య, వేముల ఎస్.ఐ ప్రవీణ్ కుమార్, యు.సి.ఐ.ఎల్ డి.జి.ఎం కిషోర్ భగత్, సి.ఎస్.ఆర్ ఇంచార్జ్ నవీన్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనెల్) తారక్ పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డిఓ చంద్రమోహన్



కాశినాయన మేజర్‌న్యూస్: మండలంలోని సావిశెట్టి పల్లె పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 10 22 పొలాన్ని ఆర్డీవో ఏ .చంద్రమోహన్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో భూమి సాగులో ఉన్న రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకం, వన్ బి , 10, 1 అడంగల్ అన్ని సక్రమంగా ఉన్నాయో లేవో స్కాన్ చేసి ఆయ వీఆర్వోలు ఫైల్ తయారు చేసి పెట్టుకోవాలన్నారు. సావిశెట్టి పల్లె పొలంలో ఇరువురి మధ్య జరుగుతున్న వాగ్వాదానికి ఇరువురు సక్రమంగా వచ్చినప్పుడు సమస్య తీరుతుందని వారు తెలిపారు. అర్జీదారుడ ఓర్సు బాలయ్య ,మరియు మా చన్నూరు సుధాకర్ ఇరువురు కలిసి గత కొన్ని సంవత్సరాలుగా పొలం నాది, నాది, అంట ఒకరి మీద ఒకరు పెట్టుకుంటూ పోట్లాడుకుంటున్నారు. ఇలాంటి సందర్భాలు రాకుండా వీఆర్వోలు చూసుకోవాలని తెలిపారు. వారి దగ్గర ఉన్న రికార్డులన్నీ పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు.

## అనుమానిత ప్రాంతాలపై స్పెషల్ డ్రైవ్

**పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా - చట్ట వ్యతిరేకతకు**
**పాల్పడితే కఠిన చర్యలు - వేంపల్లె సీఐ టి.నరసింహులు**



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు సేవించే వారిపై, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానిత ప్రాంతాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వేంపల్లె సీఐ టి.నరసింహులు వెల్లడించారు. బుధవారం జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు వేంపల్లె సిఐ టి.నరసింహులు, సిబ్బంది డ్రోన్ టెక్నాలజీ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో పాటు పోలిస్ సిబ్బంది రంగంలోకి దిగి జల్లెడ పడుతూ దాడులు నిర్వహించి నిందితులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానిత ప్రాంతాల నుండి పారిపోయిన నిందితులను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి, వీరిని పట్టుకుని కౌన్సిలింగ్, తదితర చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిరంతరం అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, జల్లెడ పట్టడం జరుగుతుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జిల్లా అధ్యక్షునిగా భూపేష్ నియామకంపై సంబరాలు



**ముద్దనూరు మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా భూపేష్ సుబ్బరామిరెడ్డిని నియమించడంపై ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముద్దనూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అలాగే బస్టాండ్ వద్ద నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి, స్వీట్లు, పండ్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా భూపేష్ సుబ్బరామిరెడ్డిని నియమించడంపై నాయకులు, కార్యకర్తలు హర్ష వ్యక్తం చేశారు.

## 11 గంటలు దాటిన తలుపులు తెరుచుకొని హౌసింగ్ కార్యాలయం




**ఖాజీపేట, మేజర్‌న్యూస్:** ఖాజీపేట మండలంలో ప్రభుత్వ గృహనిర్మాణ పథకాల లబ్ధిదారులకు అధికారుల తీరు శాపంగా మారింది. గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై లబ్ధిదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉండాల్సిన అధికారులు, సిబ్బంది 11గంటల వరకు కనిపించడం లేదనీ లబ్ధిదారులు అంటున్నారు మండలంలోని హౌసింగ్ కార్యాలయంలో పరిస్థితి ఇంత దారుణంగా ఉన్న ఉన్నతాధికారులు గాని ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. హౌసింగ్ అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితిలో లబ్ధి దారులు ఉన్నారు.హౌసింగ్ సహాయక ఇంజనీర్ బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు మండిపడుతున్నారు. గృహ నిర్మాణానికి సంబంధించిన పనులు, బిల్లులు,దరఖాస్తుల కోసం పల్లె ప్రాంతాల నుంచి వచ్చిన వారికి నిరాశ ఎదురవుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు.